ప్రజాశక్తి
శనివారం 15 ఫిబ్రవరి, 2025 5 శ్రీకాకుళం



మండపల్లి సర్పంచ్ చెక్ పవర్ రద్దు

ఇచ్ఛాపురం : మండలంలోని మండపల్లి సర్పంచ్ పిట్ట శశిరేఖ చెక్ పవర్‌ను రద్దు చేసినట్లు ఎంపిడిఒ రామారావు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచాయతీలో 2021 నుంచి 2025 వరకు నిర్వహించిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, పారిశుధ్య పనుల్లో సర్పంచ్ రూ.85 లక్షల వరకు నిధులు దుర్వినియోగం చేసినట్లు పలువార్డు గ్రామస్తులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారని అన్నారు. డిఎల్‌పిఒ గోపీబాల, ఇతర సిబ్బంది మండపల్లి పంచాయతీకి వెళ్లి రికార్డులు పరిశీలించారని తెలిపారు. తీర్మానాలు లేకుండా నిధులు ఎలా ఖర్చు చేశారని సంబంధిత సర్పంచ్‌ను ప్రశ్నించారని అన్నారు. ఆమె నుంచి సరైన సమాధానం చెప్పలేక దాటవేశారని అన్నారు. దీంతో విచారణ నివేదికను కలెక్టర్‌కు అందజేశామన్నారు. నిధులు దుర్వినియోగం అయ్యాయని రుజువు కావడంతో సర్పంచ్ చెక్ పవర్‌ను రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయని తెలిపారు. కాగా, వైసిపి సర్పంచ్ కారణంగా కక్షపూరితంగా చెక్ పవర్ రద్దు చేశారని మండల నాయకులు ఆరోపిస్తున్నారు.

మైనర్ మీడియం పాఠశాలలను కొనసాగించాలి

యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు



కంచిలి : మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాశాఖ పరిధిలో ఉర్దూ, ఒరియా, తమిళ, కన్నడ మీడియం ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉన్నాయని, వీటిని యథాతథంగా కొనసాగించాలని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఇచ్ఛాపురంలో యుటిఎఫ్ కార్యకర్తలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ఒరియా పాఠశాలలు, అనంతపురం, సత్యసాయి జిల్లాల్లో కన్నడ పాఠశాలలు, చిత్తూరు తిరుపతి, అన్నమయ్యా జిల్లాల్లో కన్నడ, ఉర్దూ మీడియం విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని అన్నారు. ఈ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందనే కారణంతో మూడు, నాలుగు, ఐదు తరగతులు స్థానికంగా ఉన్న తెలుగు మీడియం పాఠశాలలకు తరలించడం సరికాదన్నారు. కచ్చితంగా ఈ పాఠశాలలను పిల్లల సంఖ్యతో సంబంధం లేకుండా యథాతథంగా కొనసాగించాలని కోరారు. జాతీయ విద్యావిధానం-2020, విద్యా హక్కు చట్టం ప్రకారం ఎనిమిదో తరగతి వరకు మాతృభాషలోనే విద్యను అభ్యసించాలని నిబంధనలు ఉండన్నారు. వీటిని తప్పకుండా అమలు చేయాలని కోరారు. మైనర్ మీడియం బోధిస్తున్న ఉపాధ్యాయులను పాఠశాల కాంప్లెక్స్ సమావేశాలు వారి కోసమే ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలన్నారు. మరే మీడియం ఉపాధ్యాయులతో కలపవద్దని విన్నవించారు. మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లోని అన్ని పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలన్నారు. మున్సిపల్ ఉపాధ్యాయులకు వ్యక్తిగత పిఎఫ్ ఖాతాలను తక్షణం ప్రారంభించే విధంగా తగు చర్యలు తీసుకోవాలన్నారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎల్.బాబూరావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించుకోవడానికి పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్చడానికి కోసం కృషి చేయాలన్నారు. ప్రభుత్వ బడి బలపడం ద్వారానే నైతిక విలువలు పెరుగుతాయని చెప్పారు. ప్రభుత్వ బడిని పరిరక్షించుకోవడానికి, ఉపాధ్యాయ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఈ నెలలో నిర్వహించనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో యుటిఎఫ్ బలపరిచిన విజయగౌరికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జి.మాధవరావు, పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రకాష్‌రెడ్డి, సాయికృష్ణ, జెవివి రాష్ట్ర పూర్వ కార్యదర్శి మురళీధర్, భాస్కర్, చంటి, సంతోష్, శంకర్ పాల్గొన్నారు.

కంచిలి: ప్రభుత్వ పాఠశాల మీద తల్లిదండ్రులకు నమ్మకాన్ని కలిగించాలని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వరరావు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో యుటిఎఫ్ మండల శాఖ సమావేశం నిర్వహించారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్ మాట్లాడుతూ ఈ నెల 27న నిర్వహించనున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్, వివిధ అధ్యాపక, ఉపాధ్యాయ సంఘాలు బలపరిచిన ఉద్యమ అభ్యర్థి కోరెడ్ల విజయ గౌరిని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంపత్‌రావు, కిషోర్‌కుమార్, జైచంద్రరెడ్డి, జన విజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి మురళీధర్, మండల ప్రధాన కార్యదర్శి నల్లాన రవి, అధ్యక్షులు మురళీనాయక్, కోశాధికారి త్రినాథ్, గౌరవాధ్యక్షులు త్రిలోచనా ప్రధాన్, సమల్ల వెంకట్రావు, పురుషోత్తమరెడ్డి, భగవతిరావు, జిల్లా కౌన్సిలర్లు హేమసుందర్, చంద్రమౌళిలు పాల్గొన్నారు.



ప్లకార్డులతో నినాదాలు చేస్తున్న వామపక్ష నాయకులు

ఆపరేషన్ కగార్ పేరుతో దాడులు ఆపాలి

పలాస : భారతంలోని ఛత్తీస్‌గఢ్ బీజాపూర్ అటవీ ప్రాంతంలో ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీలపై సాగిస్తున్న సైనిక బలగాల దాడులను తక్షణమే ఆపాలని వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు, హక్కుల సంఘాలు ఉమ్మడిగా డిమాండ్ చేశాయి. కాశీబుగ్గ పాత బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద కేంద్ర ప్రభుత్వ పాశవిక పాలనకు వ్యతిరేకంగా శుక్రవారం ప్లకార్డులు చేతబట్టి నిరసన తెలిపాయి. ఈ దేశ మూలవాసులపై అంతిమ యుద్ధం ప్రకటించడం సిగ్గుచేటన్నారు. పర్యావరణాన్ని, ప్రకృతిని సహజ వనరులను కాపాడుతున్న ఆదివాసీలపై అంతర్యుద్ధం ప్రకటించిన దేశ హోంశాఖ మంత్రి అమిత్ షాల చర్యలను ఖండించాలని పిలుపునిచ్చాయి. మావోయిస్టుల పేరుతో అడవుల్లో ఉన్న ఆదివాసీలను అంతమొందించి అడవులను ఖాళీ చేయించి, బహుళ జాతి కంపెనీలకు అడవులను అప్పగించడానికి వీరు కగార్ ఆపరేషన్ చేపట్టారని విమర్శించారు. మావోయిస్టు భావజాలం కలిగి ఉండటం నేరం కాదని కోర్టులే స్వయంగా చెప్పున్నాయి. దేశ శత్రువులపై యుద్ధం ప్రకటించినట్టుగా డ్రోన్ కెమెరాలతో అత్యంత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అడవుల్లో జల్లెడ పట్టి సాధారణ ఆదివాసీలను కాల్చి చంపుతున్నారని అన్నారు. ఈ సైనిక బలగాలను నేతృత్వం వహిస్తున్న అధికారులపైన అత్యాచారం కింద కేసులు నమోదు చేసి విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యవర్గసభ్యులు కోనేరి మోహనరావు మాట్లాడుతూ గిరిజనుల భూములను తీసుకుని కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు కేంద్ర బిజెపి ప్రభుత్వం చేస్తున్న కుట్రలో భాగంగా కగార్ ఆపరేషన్ చేపట్టిందని విమర్శించారు. కార్యక్రమానికి సిపిఐఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్ అధ్యక్షత వహించగా, న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ సభ్యులు వంకల మాధవరావు, సిపిఐ కార్యదర్శి చాపర వేణుగోపాల్, లిబరేషన్ జిల్లా కార్యదర్శి తామాడ సన్యాసిరావు, పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షు పత్తిరి దానేష్, అమరుల బంధుమిత్రుల సంఘం రాష్ట్ర నాయకులు జోగి కోదండరావు, దేశభక్తి ప్రజాతంత్ర ఉద్యమం రాష్ట్ర నాయకులు వీరాస్వామి, ప్రగతిశీల కార్మిక సమాఖ్య మద్దిల ధర్మారావు, పువ్వ దుర్యోధన, జుత్తు వీరాస్వామి, ప్రజా కళామండలి రాష్ట్ర నాయకులు కె.నీలకంఠం, ప్రగతిశీల మహిళా సంఘం పోతనపల్లి జిల్లా నాయకులు పోతనపల్లి కుసుమ, బడకల ఈశ్వరమ్మ, బర్ల జానకమ్మ, ఎఐకెఎంఎస్ జిల్లా నాయకులు మామిడి భీమారావు, గొరకల బాలకృష్ణ, మద్దిల రామారావు, ఉత్తరాంధ్ర మహిళా సంఘం పోతనపల్లి అరుణ, నాగమణి, రైతు కూలీ సంఘం కోనేరు రమేష్, సార జగన్, బర్ల గోపి, రాపాక మాధవరావు, పోతనపల్లి మల్లిబాబు పాల్గొన్నారు.

తపాలా ఉద్యోగుల ఆందోళన

ప్రజాశక్తి- శ్రీకాకుళం

కేంద్ర ప్రభుత్వం తపాలా శాఖను ప్రయివేటీకరణ దిశగా తీసుకుపోవడానికి వడివడిగా పావులు కదుపుతుందని, దీనిని నిలుపుదల చేయాలని పిజెసిఎ జిల్లా నాయకులు వేణుగోపాల్ డిమాండ్ చేశారు. పోస్టల్ ఉద్యోగ సంఘాలు, ఎన్ఎఫ్‌పిఇ, ఎఫ్ఎన్‌పిఒ, ఎఐజిడిఎస్ఎ, ఎన్‌యుజిడిఎస్‌లు ఐక్యవేదిక పిలుపుమేరకు జిల్లా తపాలాశాఖ కార్యాలయం వద్ద శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో సైతం తపాలా శాఖను నవీకరించాలని చర్చించామన్నారు. 2010లో మెకన్సీ కంపెనీ ఇచ్చిన సిఫార్సులను, 2014లో టిఎస్ఆర్ సుబ్రహ్మణ్యం కమిటీ ఇచ్చిన ప్రయివేటీకరణ సిఫార్సులను ఇటీవల తపాలా శాఖలో త్వరితగతిన పేర్లు మార్చి అమలు చేస్తుందన్నారు. ఇప్పటికే తపాలా చట్టం-2023 అమలులోకి వచ్చిన వెంటనే అనేక రకాలుగా ప్రజలకు ఇచ్చే చౌకైన సేవలను సైతం దూరం చేశారని అన్నారు. వెంటనే పోస్టల్ చట్టం-2023ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రయివేటీకరణ దిశగా ఇటీవల విడుదల చేసిన ఉత్తర్వులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యు.వి.రమణ, గణపతి, వాన శ్రీను, వెంకటేష్, బాబూరావు, గురన్న, రామకోటి పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న తపాలాశాఖ ఉద్యోగులు

శ్రీముఖలింగంలో శివరాత్రికి పక్కాగా ఏర్పాట్లు

ఆర్‌డిఒ సాయిప్రత్యూష

ప్రజాశక్తి- జలుమూరు

మండలంలోని శ్రీముఖలింగేశ్వర ఆలయంలో శివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లను పక్కాగా చేయాలని, గతంలో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా చూడాలని రెవెన్యూ డివిజనల్ అధికారిణి సాయిప్రత్యూష అధికారులను ఆదేశించారు. ఆలయంలో అధికారులతో, పోలీస్ సిబ్బందితో, ఆలయ కమిటీ సభ్యులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 26, 27, 28 తేదీల్లో నిర్వహించనున్న మహాశివరాత్రి మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యాత్రికుల దర్శనం సమయంలో సమస్య లేకుండా చూడాలన్నారు. నదిలో స్నానాలు చేయడానికి సరిపడిన నీటి నిల్వ చేయాలన్నారు. తాగునీరు అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. లైటింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు. జనరేటర్లు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ముందుగానే అంతా వైరింగ్ పరిశీలన చేసుకోవాలని ఆదేశించారు. ఉత్సవాలు విజయవంతం చేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. విధుల్లో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆర్అండ్‌బి రహదారులపై రోడ్డుకు ఇరువైపులా తుప్పలు సరిచేయాలని ఆదేశించారు. సిబ్బందికి ఇప్పటి నుంచే విధులు కేటాయించాలన్నారు. 104, 108 వాహనాలు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ప్రత్యేక వైద్య శిభిరాలు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే అవసరమైన మందులు, సిబ్బందిని సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. పారిశుధ్యంపై దృష్టి సారించి కావలసిన పారిశుధ్య కార్మికులను ఏర్పాటు చేసుకునేలా చర్యలు చేపట్టాలని డివిజనల్ పంచాయతీ అధికారికి ఆదేశించారు.



మాట్లాడుతున్న ఆర్‌డిఒ సాయిప్రత్యూష

కార్యక్రమంలో దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ బి.ఆర్.బి.వి.ప్రసాద్ పట్నాయక్ మాట్లాడుతూ దర్శనానికి వచ్చే యాత్రికులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తామన్నారు. సిఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ సిసి కెమెరాల ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎస్ఐ మాట్లాడుతూ రోప్ పార్టీ లోపల నిర్దేశించిన వాళ్ల మాత్రమే ఉండేలా చూడాలన్నారు. సమావేశంలో తహాశీల్దార్ జె.రామారావు, ఎంపిడిఒ అప్పలనాయుడు, ఆలయ ఇఒ ప్రభాకరరావు, డివిజనల్ పంచాయతీ అధికారి ఐ.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' సిబ్బందిపై పీడీ వేధింపులు

సమస్యను పరిష్కరించాలని వినతి



డిఆర్‌ఒకు వినతిపత్రం అందిస్తున్న ఉద్యోగులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టం (ఎంజిఎన్ఆర్ఇజిఎ) సిబ్బందిని మానసికంగా, శారీరకంగా వేధించడం తగదని, ఈ విధానాన్ని ఉపసంహరించుకోవాలని నీటి యాజమాన్య సంస్థ ఉద్యోగులు అన్నారు. సంస్థకు చెందిన పలు కేడర్లలో పని చేస్తున్న ఉద్యోగులు శుక్రవారం డిఆర్ఒ వెంకటేశ్వరరావు, డ్వామా పీడీ బి.సుధాకరరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు మాట్లాడుతూ జిల్లా ఉపాధి హామీ సిబ్బందిని కించపరిచే విధంగా వ్యవహరిస్తూ అందరిన్నీ దొంగలుగా చూడటం సమంజసం కాదన్నారు. కార్యాలయ పనివేళల్లో కాకుండా నిరంతరం రాత్రి సమయాల్లో సైతం వీడియో కాన్ఫరెన్స్‌లు, టెలికాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తూ తీవ్ర పనిఒత్తిడి గురి చేస్తున్నారని, తాము భరించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పీడీ సుధాకరరావు వ్యవహార శైలితో తాము నిరంతర మానసిక ఆందోళన విధులను నిర్వర్తిస్తున్నామని చెప్పారు. అన్ని ప్రభుత్వ శాఖల మాదిరిగానే తమకు ఎనిమిది గంటల పని దినాన్ని తమకు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోనే అత్యధిక స్థాయిలో కూలీలు పనులు కల్పించి జిల్లాకు రూ.400 కోట్లు మెటీరియల్ కాంపోనెంట్ నిధులను సమకూర్చిన ఘనత ఈ జిల్లాకు దక్కుతుందన్నారు. అటువంటి వారిని నిత్య దూషణలతో, అవమానాలతో కించపరిచే విధంగా మాట్లాడటం, సంక్రాంతి వంటి పర్వదినాల్లోనూ సెలవులు ఇవ్వకుండా మమ్మల్ని వేధించారని వారు కన్నీటి పర్యంతమవుతున్నారు. ఎన్ఆర్‌జిఎలో పనిచేస్తున్న మహిళల మనోభావాలను దెబ్బతీస్తూ వారిని కించపరిచే విధంగా వ్యవహరిస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. సామాజిక తనిఖీ ఆడిట్లో జరిమానాలు, రికవరీలు విపరీత స్థాయిలో ఉంటున్నాయని వీటిని కుదించాలని వివక్ష చూపించడం సరికాదని వారు పేర్కొన్నారు. ఇతర ఇంజినీరింగ్ శాఖల సిబ్బంది చేయాల్సిన పనులనూ ఉపాధి సిబ్బందితో చేయించడం ద్వారా కక్ష పూరిత చర్యలకు పాల్పడుతున్నారని వారు మండిపడ్డారు. తమ సమస్యలను సానుకూలంగా పరిష్కరించాలని, వేధింపులు కొనసాగితే పోరాటం మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. దీనిపై డిఆర్ఒ వెంకటేశ్వరరావు స్పందిస్తూ ఉద్యోగుల సమస్యలను సానుకూలంగా పరిశీలించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వినతిపత్రం అందించిన వారిలో ఉపాధి హామీ ఉద్యోగుల జెఎసి నాయకులు వై.వి.రమణ, అమ్మినాయుడు, జయరాం, తవిటి నాయుడు, తెంబూరు రవి, అరుణ్ కుమార్, ప్రేమ లత, ప్రమీల, రత్నాకర్, ధర్మారావు, రామచంద్రరావు, అన్ని మండలాల ఎపిఒలు, ఇసిలు, టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

ఎఫ్‌డిఐ ప్రతిపాదనలు ఇన్సూరెన్స్‌కు నష్టం

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

వంద శాతం ఎఫ్‌డిఐ ప్రతిపాదనలతో ఇన్సూరెన్స్ రంగానికి తీవ్ర నష్టమని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ విశాంత్ర ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కొయ్యాన నారాయణ, విశాఖ డివిజన్ ఎగ్జిక్యూటివ్ సభ్యులు కేతవరపు శ్రీనివాసు అన్నారు. ఇన్సూరెన్స్ రంగంలో వంద శాతం ఎఫ్‌డిఐలను అనుమతించాలన్న కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదనలను నిరసిస్తూ శుక్రవారం నగరంలోని స్థానిక ఎల్ఐసి కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిర్ణయం దేశ ప్రయోజనాలకు పాలసీదారుల ప్రయోజనాలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. ఇప్పటికే 74 శాతం ఎఫ్‌డిఐకి అనుమతి ఇచ్చినా 32 శాతం మాత్రమే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు వచ్చాయని అన్నారు. ఈ నేపథ్యంలో వంద శాతం చేయాల్సిన అవసరం ఏమి వచ్చిందని వారు ప్రశ్నించారు. ఈ చర్య విదేశీ పెట్టుబడుదారులను సంతృప్తిపరిచేందుకేనని విమర్శించారు. గతంలో యుపిఎ ప్రభుత్వం ఎఫ్‌డిఐ పరిమితిని పెంచేందుకు ప్రయత్నిస్తే బిజెపి ఆనాడు వ్యతిరేకించిందని, ఇప్పుడు మాట మార్చి వ్యవహరించడం తగదని విమర్శించారు. పాలసీదారుల డబ్బును లాభాపేక్షతో విదేశీ కంపెనీలు తమ దేశాలకు తరలించుకుపోయే ప్రమాదం ఉందని వారు హెచ్చరించారు. వంద శాతం ఎఫ్‌డిఐల ప్రతిపాదన రద్దు చేయాలని, ఎల్ఐసిలో వెంటనే ఉద్యోగాల భర్తీ చేపట్టాలని, జిఐసి ఉద్యోగుల వేతన సవరణ వెంటనే నిలుపుదల డిమాండ్ చేశారు. ఇన్సూరెన్స్ రంగాల్లో పెట్టుబడి పెద్ద ఎత్తున పెట్టాల్సిన అవసరం ఏమీ లేదని, ఆ మాత్రం పెట్టుబడి స్వదేశీ పెట్టుబడిదారులు వద్ద ఉన్నదని అన్నారు. కార్యక్రమంలో ఎం.ప్రభాకరరావు, బి.శివాజీ, కె.రమేష్‌కుమార్, ఎం.వి.కామేశ్వరరావు, డి.అచ్యుతరావు, జె.ఎల్. పరిమళ, పి.టి.ఎన్.మూర్తి, బి.వి.ఎల్.శశిధర్, ఎ.కనకరాజు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న విశ్రాంత ఉద్యోగులు

పటిష్టంగా డ్రోన్ నిఘా

ప్రజాశక్తి- శ్రీకాకుళం

శ్రీకాకుళం రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బహిరంగంగా మద్యం సేవించిన వారిని డోన్ కెమెరా ద్వారా గుర్తించి కేసులు నమోదు చేస్తున్నారు. ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం చింతాడ, సిద్దిపేట, నైర గ్రామాలు, పలు గ్రామీణ ప్రాదేశాలు, జాతీయ రహదారి ఇరువైపులా ఖాళా ప్రదేశాల్లో శుక్రవారం డ్రోన్ నిఘా ఏర్పాటు చేశారు. బహిరంగంగా మద్యం సేవించడం, గంజాయి వినియోగించిన వారిపై డ్రోన్ కెమెరాలతో నిఘా పెట్టీ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు అడ్డుకట్టు వేస్తున్నారు. ఖాళీ బంగ్లాలపై, తోటలపైనా డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు. పేకాట, అసాంఘిక కార్యకలాపాలు నిర్వహణ, ఈవ్ టీజింగ్, చైన్ స్నాచింగ్ ఇతర నేరాల నియంత్రణకు చర్యలు పోలీసులు చర్యలు చేపట్టారు.



యుక్త వయసు గర్భధారణలపై దృష్టి

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి


యుక్త వయస్సు గర్భదారణలు అధికంగా నమోదు కావడంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం మహిళా శిశు సంక్షేమశాఖ ద్వారా అమలవుతున్న కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యుక్త వయసులో అధిక గర్భదారణలు నమోదు కావడంపై గల కారణాలను విశ్లేషించి ప్రతి సిడిపిఒ ఒక కేసు స్టడీతో తర్వాత నిర్వహించే సమీక్షా సమావేశానికి రావాలని ఆదేశించారు. గ్రామస్థాయిలో బాల్య వివాహాలపై మహిళా సంరక్షణ కార్యదర్శులతో క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయించి, వాటి నిర్మూలనకు కృషి చేయాలని సూచించారు. గ్రామస్థాయిలో కిషోరి బాలికల రక్షణ, అభివృద్ధి కోసం అమలు చేస్తున్న వికాసం కార్యక్రమాన్ని సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకొని అమలు చేయాలని ఆదేశించారు. సున్నా నుంచి ఆరు సంవత్సరాల పిల్లలకు ఆధార్ డ్రైవ్ ద్వారా ప్రతి ఒక్క పిల్లవాడికీ కార్డులు వచ్చేటట్లు చర్యలు చేపట్టాలని తెలిపారు. గత ఆరు నెలలుగా క్షేత్రస్థాయిలో పోషకాహార లోపంతో బాధపడుతున్న పిల్లలు వివరాలను విశ్లేషణ చేసి నివేదికలు సమర్పించాలని చెప్పారు. గ్రామస్థాయిలో గ్రామ బాలల సంక్షేమ, రక్షణ కమిటీలను గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులతో తరుచూ సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహించాలన్నారు. మహిళా, శిశు అభివృద్ధిశాఖ ద్వారా అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను సక్రమంగా అమలు చేసే బాధ్యత సిడిపిఒలపై ఉందని చెప్పారు. సమావేశంలో ఐసిడిఎస్ పీడీ బి.శాంతి, డిసిపిఒ కె.వి. రమణ, వసిడిపిఒలు, చిల్డ్రన్ హోమ్స్, వన్‌స్టాఫ్ సెంటర్, డివి సెల్ సిబ్బంది పాల్గొన్నారు.

డిసిసిబి సిఇఒగా సత్యనారాయణ

వ్యక్తిగత కారణాలతో వరప్రసాదరావు రాజీనామా

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లా కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు సిఇఒగా దత్తి సత్యనారయణ నియమితులయ్యారు. గతేడాది జూలైలో నోటిఫికేషన్ వెలువరించిన ఆయనున్న ఆప్కాబ్ ఎండీ, రిజిస్ట్రీ ఆఫ్ కో-ఆపరేటివ్ కమిషనర్ ఆధ్వర్యాన కమిటీ ఆయనును ఎంపిక చేసింది. వాస్తవానికి ఆయన రాజమండ్రి ఆర్యపురం అర్బన్ కోపరేటివ్ బ్యాంకు మేనేజర్‌గా పనిచేస్తూ 2016లో జిల్లాకు సిఇఒగా వచ్చారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత 2021 వరకు ఆయన సేవలను అప్పటి ప్రభుత్వం, బోర్డు పొడిగించింది. తర్వాత ఆయనను బదిలీ చేయడంతో ఒరిజనల్ పోస్టు వయోపరిమితి 57 ఏళ్లు కావడంతో రిటైరయ్యారు. డిసిసిబి సిఇఒ వయోపరిమితి 65 ఏళ్లు కావడంతో ఆయన మరో మూడు ఏళ్లు చేసే అవకాశం ఉంది. కొత్త సిఇఒగా నియమితులైన నేపథ్యంలో శ్రీకాకుళం నగరంలోని స్థానిక డిసిసిబి కార్యాలయంలో శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. అధికారులు, ఉద్యోగులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జెసి ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇప్పటివరకు సిఇఒగా పనిచేస్తున్న వరప్రసాదరావు వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేసినట్లు తెలుస్తోంది.



బాధ్యతలను స్వీకరిస్తున్న సత్యనారాయణ



మాట్లాడుతున్న మేనేజర్ అమరసింహుడు

అప్రమత్తతతోనే ప్రమాదాల నివారణ

శ్రీకాకుళం: వాహనదారులు అప్రమత్తంగా వ్యవహరించి వాహనాలను నడపాలని శ్రీకాకుళం 1,2 డిపో మేనేజర్లు అమరసింహుడు, శర్మ సూచించారు. జాతీయ రహదారి భద్రతా మసోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆర్‌టిసి డిపో 1,2 మేనేజర్లు ఆధ్వర్యాన జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ప్రయాణికులకు అవగాహన కల్పించేందుకు బస్‌స్టేషన్ నుంచి ఏడు రోడ్ల కూడలి వరకు కాకినాడ ఆదిత్య కళాశాలకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. రహదారి భద్రతపై శ్రద్ధ వహించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రహదారి భద్రతా నియమాలను విధిగా పాటించాలన్నారు. ద్విచక్రవాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. నాలుగు చక్రాల వాహనదారులు తప్పనిసరిగా సీటు బెల్ట్ ధరించాలని తెలియజేశారు. 1, 2వ డిపోలు ప్రమాదరహిత డిపోలుగా నిలవాలని ఆకాంక్షించారు. ఫోన్‌లో మాట్లాడుతూ వాహనం నడపరాదన్నారు. అతివేగంగా వాహనాలు నడపరాదన్నారు. కార్యక్రమంలో కార్యాలయ, భద్రత నిఘా విభాగం సిబ్బంది, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ నాగభూషణం, పిఆర్ఒ సుమన్ పాల్గొన్నారు.

చెక్‌పోస్టు వద్ద అప్రమత్తం

పాతపట్నం: బర్డ్ ఫ్లూ వ్యాధి నియంత్రణలో అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టుల్లో పనిచేస్తున్న పశు వైద్య సిబ్బంది, పోలీసులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా పశు సంవర్థకశాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ కంచనాన రాజగోపాలరావు సూచించారు. ఆంధ్రా-ఒడిశా సరిహద్దు వసుంధర చెక్‌పోస్టును శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏవైనా చనిపోయిన కోళ్లు వాహనాల ద్వారా రవాణా అయితే వాటిని నియంత్రించాలన్నారు. పశు వైద్య సిబ్బంది ప్రతి ఎనిమిది గంటలకు ఒకరు చొప్పున చెక్ పోస్టులో పనిచేయాలని ఆదేశించారు. అంతకుముందు ఆయన ప్రాంతీయ పశు వైద్యశాల పాతపట్నంలో పశు వైద్యాధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బర్డ్ ఫ్లూ వ్యాధి లక్షణాలు ఎక్కడైనా కనిపిస్తే వెంటనే జిల్లాలోని కంట్రోల్ రూమ్‌కు సమాచారం తెలియజేయాలన్నారు. బర్డ్ ఫ్లూ వ్యాధిపై కోళ్ల పెంపకందారులకు పూర్తి అవగాహన కల్పించాలన్నారు. పశు వైద్య సిబ్బంది ప్రతి ఒక్క కోళ్ల ఫారానికి తనిఖీ చేసి పెంపకందారులకు సూచనలు చేయాలన్నారు. ప్రస్తుతం ఈ వ్యాధి జిల్లాలో లేదని, అయినా ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామన్నారు. కార్యక్రమంలో పాతపట్నం ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ మంచు కరుణాకరరావు, పశు వైద్యాధికారులు పి.అనిల్, బి.శ్రీవాణి, కె.మౌనిక, సిబ్బంది రాస, ఢిల్లీ, భీమారావు, విజయ్‌కుమార్, కుమారి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.



తనిఖీ చేస్తున్న పశుసంవర్థకశాఖ జెడి రాజగోపాలరావు


నమోదు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి త్రినాథరావు

భూ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

రణస్థలం రూరల్: రైతులు భూమి రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి కోరాడ త్రినాథరావు అన్నారు. మండలంలోని రణస్థలం, వేల్పురాయి పంచాయతీల్లో రైతు విశిష్ట సంఖ్య గుర్తింపు నమోదు కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో సందర్శించారు. సొంత భూమి కలిగిన రైతులందరూ ఖచ్చితంగా ఫార్మర్స్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని రైతులకు సూచించారు. పిఎం కిసాన్, పెట్టుబడి సాయం, పంట భీమా, సూక్ష్మ నీటి పారుదల పథకం వంటి ప్రభుత్వం అందించే పథకాలను పొందాలంటే రైతు విశిష్ట సంఖ్య ఖచ్చితంగా ఉండాలని ఎడిఎ భవాని శంకర్ రైతులకు తెలిపారు. ప్రతి రైతు సేవా కేంద్రంలో రైతులు తమ ఆధార్, భూమి పాస్ బుక్, ఆధార్ లింక్ అయిన ఫోన్ నెంబర్‌ను తీసుకెళ్లి విశిష్ట సంఖ్య గుర్తింపు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి విజయ్ భాస్కర్ తెలిపారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.


బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

నాణ్యమైన బంగారాన్ని అందించాలి

నరసన్నపేట: నాణ్యతా ప్రమాణాలు కలిగి ఉన్న బంగారాన్ని కొనుగోలుదారులకు అందించాలని, వివిధ స్కీమ్‌ల ద్వారా సాయి స్వర్ణ ప్యాలెస్ ప్రోత్సాహం చేస్తుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. నరసన్నపేట పట్టణంలో సాయి స్వర్ణ ప్యాలస్ బంగారం దుకాణంలో నిర్వహించిన లక్కీ డ్రాను శుక్రవారం తీశారు. అనంతరం గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సాయిస్వర్ణ ప్యాలస్ అధినేత నానాజీ గాడ్గే, నానాజీ బ్రదర్ శంకర్, మండల పార్టీ అధ్యక్షులు శిమ్మ చంద్రశేఖర్, కళింగ కార్పొరేషన్ చైర్మన్ రోణంకి కృష్ణంనాయుడు, బైరి భాస్కరరావు, అడపా చంద్రశేఖర్, గొద్దు చిట్టిబాబు, కింజరాపు రామారావు, సాసుపల్లి కృష్ణబాబు, జామి వెంకటరావు, పీస కృష్ణ, బోయిన సతీష్, సరిపల్లి మధు, బేవర శివ పాల్గొన్నారు.

నూతన పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాల బిఎస్అండ్‌హెచ్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ సాయిబాబు నెయ్యిల, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎన్.ఎల్.శ్రీకాంత్‌లు సంయుక్తంగా ఇండస్ట్రియల్ మేనేజ్‌మెంట్ అండ్ ఎంటర్ పెన్యూర్షిప్ పేరుతో రచించిన నూతన పుస్తకాన్ని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు శుక్రవారం తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ పుస్తకం వల్ల ఎంబిఎ, బిబిఎం విద్యార్థులతో పాటు పారిశ్రామిక రంగాల్లో స్థిరపడాలనుకున్న బిటెక్, ఇతర డిగ్రీ విద్యార్థులకు అవగాహన కల్పించేలా ఈ పుస్తకాన్ని రచించారని డైరెక్టర్ పేర్కొన్నారు. వీరిని డైరెక్టర్‌తో పాటు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, ఆర్అండ్‌డి అసోసియేట్ డీన్ డాక్టర్ కె.వేణుగోపాల్, బిఎస్ఇండ్‌హెచ్ విభాగాధిపతులు డాక్టర్ ఎం.వి.రత్న మణి, డాక్టర్ ఎం.రమణయ్య, ఎంబిఎ విభాగాధిపతి డాక్టర్ బి.శివకుమార్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.


మాట్లాడుతున్న ప్రసాద్

పలాస కుర్రాళ్లను ఆదరించాలి

పలాస: పలాస కుర్రోళ్లు రెండేళ్లు ఎంతో శ్రమించి ఐ ఫోన్‌లో చిత్రీకరించి 'హే కేశవ.. హేమాదర... హే గోవిందా'.. చిత్రాన్ని నిర్మించి ప్రదర్శించేందుకు సిద్ధమవుతున్న పలాస కుర్రాలను ఆదరించాలని చిత్ర దర్శకుడు జి.కె.ప్రసాద్ కోరారు. కాశీబుగ్గ ఆంధ్రా బ్యాంకు రోడ్డు లిటిల్ ఛాంపియన్ స్కూల్ ఆవరణంలో శనివారం సాయంకాలం ఆరు గంటలకు చిత్ర ప్రదర్శన ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం మాట్లాడుతూ మన ప్రాంతంలో జరిగిన యదార్థ సంఘటనలు, యువకులు వల్ల ప్రభావితమయ్యే సమాజం గురించి మెసేజ్ ఓరియెంటెడ్‌గా, క్రైమ్ థ్రిల్లర్ మూవీగా చిత్రీకరించామన్నారు. వివిధ రకాల సినీ కార్యక్రమాలు, మిమిక్రీ వంటి అంశాలు ఉంటాయన్నారు. గ్రీన్‌ఆర్మీ అధ్యక్షులు బోనెల గోపాల్ మాట్లాడుతూ మన ప్రాంత యువకులు ఎంతో శ్రమించి, తమలో ఉన్న టాలెంట్ వ్యక్తపరిచే విధంగా మీరు ఆశించే విధంగా ఈ చిత్రం ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆర్‌డి ఎక్స్ రాజా, పలాస వాసి దిలీప్‌కుమార్, దివాకర్, నిత్యానాద్పండ, చిత్ర బృందం పాల్గొన్నారు.

ఎక్కువ కేసుల రాజీకి కృషి

శ్రీకాకుళం లీగల్: మార్చి 8న జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీకి కృషి చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జూనైద్ అహ్మద్ మౌలానా అన్నారు. స్థానిక జిల్లా కోర్టు భవనంలో పోలీస్ అధికారులు, ఇన్స్యూరెన్స్ కంపెనీలతో, న్యాయవాదులతో శుక్రవారం సమీక్షించారు. ఎక్కువ కేసులు రాజీ చేసి జిల్లాలోని పెండింగ్ కేసులను తగ్గించాలని తెలిపారు. రాజీయే రాజ మార్గమని, ఇరు పార్టీలు గెలవడం, రాబోవు కాలాల్లో ఇరువురి మధ్య మంచి సంబంధం నెలకొల్పడమే దీని ముఖ్య ఉద్దేశమన్నారు. బైక్ ప్రమాదాలు కేసుల్లో ఇన్స్యూరెన్స్ కంపెనీలు త్వరితగతిన ప్రజలకు న్యాయం చేకూర్చాలని కోరారు. కార్యక్రమంలో అదనపు జిల్లా జడ్జి పి.భాస్కరరావు, మూడో అదనపు జిల్లా జడ్జి సిహెచ్.వివేక్ ఆనంద్ శ్రీనివాస్, నాలుగో అదనపు జిల్లా జడ్జి ఎస్.ఎల్.ఫణికుమార్, కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జి కె.వి.ఎల్.హిమ బిందు, అడిషనల్ ఎస్‌పి పి.శ్రీనివాసరావు, మంచు జనార్ధనరావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు పాల్గొన్నారు.

కాలం చెల్లిన కాలువలతో అవస్థలు

- మురుగునీరు రోడ్లపైనే
- వ్యాప్తి చెందుతున్న వ్యాధులు

గ్రామీణ ప్రాంతాలు సైతం సుందరంగా తీర్చిదిద్దుతామని ప్రకటనలు గుప్పిస్తున్న ప్రభుత్వం, పాలకవర్గం ఆ దిశగా చర్యలు తీసుకున్న దాఖలాలు ఎక్కడా కనిపించడం లేదు. దీంతో గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అవస్థలు తప్పడం లేదు.

ప్రజాశక్తి- బూర్జ

కాలం చెల్లిన కాలువలతో ఆ గ్రామస్తులకు అవస్థలు తప్పడం లేదు. పెద్దలంకాం గ్రామంలో సమస్యలు తిష్ట వేశాయి. మండలంలోని అతిపెద్ద పంచాయతీ అయినప్పటికీ గ్రామంలో ఎటువంటి సదుపాయాలు లేవని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దశాబ్దాల కాలంగా ఎటువంటి మౌలిక సదుపాయాలు లేకపోవడంతో అవస్థలు ఎదుర్కొంటున్నామని స్థానికులు వాపోతున్నారు.

మురుగునీరు రోడ్లపైనే

గ్రామంలోని వీధుల్లో సరైన మురుగు కాలువలు లేకపోవడంతో అవస్థలు తప్పడం లేదు. పురాతనమైన కాలువలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో కాలువలు


కాలువలు లేక రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

మూతపడ్డాయని స్థానికులకు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే వాడుకనీరంతా రోడ్లపైకి రావడంతో అనునిత్యం అవస్థలు ఎదుర్కొంటున్నామని, ఇదే విషయాన్ని పాలక వర్గానికి, అధికారులకు పలు మార్లు విన్నవించుకున్నప్పటికీ ఫలితం శూన్యమని ప్రజలు వాపోతున్నారు. మండు వేసవిలో కూడా మురుగునీరు రోడ్లపైన ప్రవహిస్తుందని, తాగునీరుకు ఉపయోగించే బోర్లు వద్ద కూడా మురుగునీరు చేరి దుర్గంధం వెదజల్లుతుందని గ్రామస్తులు వాపోతున్నారు.

గుంతలు ఏర్పడిన రహదారులు

గ్రామంలోని పలువీధుల్లో రహదారులు గోతులు ఏర్పాడ్డాయి. పూర్తిగా రహదారులు రాళ్లు తేలడంతో నడవడానికి కూడా ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు వాపోయారు.

కన్నెత్తి చూడని అధికారులు

గ్రామంలో సమస్యలపై పలుమార్లు అధికారులకు తెలియజేశామని, అలాగే పాలక వర్గం దృష్టికి కూడా తీసుకెళ్లినప్పటికీ ఇంతవరకు అధికారులు మా గ్రామమైపు కన్నెత్తైన చూడలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకవర్గం స్పందించి ఇరువైపుల కాలువలను ఏర్పాటు చేయాలని, అలాగే రహదారులు ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

కాలువలు ఏర్పాటు చేయాలి



గ్రామంలో వీధి కాలువలు లేక మురుగు నీరుతో నానా అవస్థలు పడుతున్నాం. రోడ్లపైనే మురుగు నీరు నిల్వ ఉంటుంది. కాలువలు బాగు చేసేందుకు అధికారులు చొరవ చూపాలి.

- గౌరినాయుడు, పెదలంకాం

రోడ్లను బాగు చేయాలి



గ్రామంలోని వీధుల రోడ్లు సరిగా లేకపోవడంతో రాత్రి సమయాల్లో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాం. వీధుల్లోని రహదారులను బాగు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

సాయిరాం, పెదలంకాం

'స్టెమీ' ఇంజెక్షన్లు సిద్ధం

మందస : సుగర్, బిపి, ఆయాసం, గుండె నొప్పి ఎడమ చేయి లాగడం వంటి లక్షణాలు ఉన్నట్లయితే తక్షణమే ప్రభుత్వాస్పత్రిని సందర్శిస్తే స్టెమి ఇంజెక్షన్ ఇస్తామని హరిపురం సిహెచ్‌సి సూపరింటెండెంట్ స్వరాజ్యలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఇసిజి తీసి గుండెపోటు ఉన్నట్లయితే రూ.40 వేలు ఖరీదు చేసే స్టెమీ ఇంజెక్షన్లు ఉచితంగా అందజేస్తామన్నారు.

పాతపట్నంలో పారిశుధ్య పనులు

పాతపట్నం : పాతపట్నం నీలమణి దుర్గ అమ్మవారి ఆలయం వద్ద నుంచి ప్రధాన రోడ్డు మొత్తం ఇరువైపులా ఉండే చెత్తా చెదారాన్ని, ధూళిని పారిశుధ్య కార్మికులు శుక్రవారం తొలగించారు. పంచాయతీ ఇఒ వరప్రసాద్, సర్పంచ్ ప్రతినిధి సిర్ల జోగారావు పర్యవేక్షణలో ఈ పనులు చేపట్టారు. పంచాయతీ ప్రజల ఆరోగ్యాని దృష్టిలో పెట్టుకొని ఈ పనులు చేపడుతున్నారు.

సేవలే గుర్తింపునిస్తాయి

వజ్రపుకొత్తూరు: రాజకీయాలకతీతంగా పనిచేసిన వారికి ప్రజలు నుంచి గుర్తింపు లభిస్తుందని సర్పంచ్ గూడ గిరిజ, ప్రతినిధి ఈశ్వరరావు అన్నారు. గరుడభద్ర గ్రామ సచివాలయంలో ఐదేళ్లు సేవలు అందించి బదిలీపై వేరే చోటికి వెళ్లిపోయిన పంచాయతీ కార్యదర్శి బి.మోహన్, డిడిఒ మణికంఠ, డిజిటల్ అసిస్టెంట్ బి.శ్రీకర్, వెల్ఫేర్ అసిస్టెంట్ బి.స్వాతి, ఉమెన్ పోలీస్ టి.ఊర్వశి, అసిస్టెంట్ లైన్‌మేన్ జి.లక్ష్మీకాంత్, విలేజ్ సర్వేయర్ కె.వెంకటేష్‌లను శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యోగులు నియమ నిబంధనలు పాటించి క్రమశిక్షణతో రాజకీయాల కతీతంగా పనిచేసి ప్రజల మన్ననలు పొంది ఉద్యోగ జీవితంలో ఉన్నత స్థానంలో నిలవాలని కోరారు. గ్రామసంఘం అధ్యక్షులు కె.మోహనరావు, గ్రామపెద్దలు జి.భాస్కరరావు, వై.ఆనందరావు, వై.ధర్మారావు, కె.వల్లభరావు, జి.ధనరాజ్, ఎ.దానేసు, నారాయణరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జడ్జి కిషోర్‌బాబు

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి

సోంపేట: మార్చి 8న నిర్వహి ంచనున్న లోక్ అదా లత్‌ను విజయ వంతం చేయాలని ఆరో అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు కె.కిషోర్‌బాబు కోరారు. పలాస డిఎస్‌పి వెంకట అప్పారావు, సోంపేట సిఐ మంగరాజు, సోంపేట, కంచిలి, బారువ, మందస ఎస్ఐలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో రాజీకి అవకాశం ఉన్న కేసులను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎపిపి నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.


శాంపిల్స్‌ను సేకరిస్తున్న వెంకటరత్నం

హోటళ్లు, రెస్టారెంట్ల తనిఖీ

శ్రీకాకుళం: నగరంలోని 80 అడుగుల రోడ్డులో నిర్వహిస్తున్న హోటళ్లు, రెస్టారెంట్లను జిల్లా ఆహార నియంత్రణాధికారి కె.వెంకటరత్నం శుక్రవారం తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా తయారు చేసే ఆహార పదార్థాలకు సంబంధించి శాంపిల్స్ సేకరించి ఎనాలిసిస్ చేస్తామన్నారు. హోటళ్లు, రెస్టారెంట్ల నిర్వాహకులకు ఆహార పదార్థాలు సరఫరాపై పలు సూచనలు జారీ చేశారు. ఈ తనిఖీలో ఫుడ్ సేఫ్టీ అధికారి కె.లక్ష్మి పాల్గొన్నారు.


చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం

కలెక్టరేట్‌లో మాజీ సిఎం దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ మేరకు శుక్రవారం సంజీవయ్య చిత్రపటానికి కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జెసి ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి శాంతిశ్రీ, ఎస్‌డిసి పద్మావతి, అప్పారావు, సాంఘిక సంక్షేమశాఖ ఉపసంచాలకులు విశ్వమోహన్‌రెడ్డి, సాంఘిక సంక్షేమశాఖ, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

సంజీవయ్య జయంతి

అరసవల్లి: దామోదర సంజీవయ్య చిరస్మరణీయుడని దళిత సంఘాల నేతలు కొనియాడారు. నగరంలోని పాలకొండ రోడ్డులో గల దామోదర సంజీవయ్య పార్క్‌లో సంజీవయ్య 104వ జయంతి ఉత్సవాలను నిర్వహించారు. సంజీవయ్య విగ్రహానికి వారంతా పూలమాలలు వేసి నివాళ్ళులర్పించారు. దళిత సంఘాల జెఎసి నాయకులు, సంజీవయ్య ట్రస్ట్ ప్రతినిధులు, అంబేద్కర్స్ ఇండియా మిషన్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దళిత నాయకులు తైక్వాండో శ్రీను, డా.కంఠ వేణు, యజ్జల గురుమూర్తి మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దళిత ముఖ్యమంత్రిగా సేవలు అందజేసిన దామోదరం సంజీవయ్య నేటి యువతకి స్ఫూర్తిదాయకమన్నారు. విలువలతో కూడిన రాజకీయాలు చేసి అందరి మన్ననలను సంజీవయ్య పొందారన్నారు. కార్యక్రమంలో దళిత ఉద్యోగుల సంఘం నాయకుడు బడియ కామరాజు, అర్జి కోటి, పురుషోత్తం రాంబాబు, పెయ్యల చంటి, నేతల అప్పారావు, సీర రాజేశ్వరి, అబ్బాస్, కళ్యాణ్, అప్పన్న పాల్గొన్నారు.

సెమిస్టర్ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి- శ్రీకాకుళం

శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా కళాశాల (స్వయం ప్రతిపత్తి)లో మొదటి, మూడో సెమిస్టర్ ఫలితాలను ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ టి.ఆదిలక్ష్మి శుక్రవారం విడుదల చేశారు. మొదటి సెమిస్టర్ ఫలితాల శాతం వరుసగా బిఎ 37.41 శాతం, బికాం 50.31 శాతం, బిఎస్‌సి 71.90 శాతం ఫలితాలు వచ్చాయని అన్నారు. కళాశాల ఫలితాలు మొత్తం 57.95 శాతం వచ్చిందని తెలిపారు. రెండో సంవత్సరంలో ఉన్న మూడో సెమిస్టర్ ఫలితాల శాతం వరుసగా బిఎ 70.71 శాతం, బి.కాం 79.28 శాతం, బిఎస్‌సి 73.14 శాతం ఫలితాలు వచ్చాయని చెప్పారు. కళాశాల మొత్తం 74.14 శాతం వచ్చిందన్నారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులకు అభినందనలు తెలియజేశారు. ఇంకా ఎక్కువ


ఫలితాలను విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్ సూర్యచంద్రరావు

ఫలితాల శాతం సాధించే దిశగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి.శంకరనారాయణ, అకడమిక్ కో-ఆర్డినేటర్ సిహెచ్.కృష్ణారావు, ఐక్యూఎసి కో-ఆర్డినేటర్ ఎస్.పద్మావతి, డిప్యూటీ కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ పి.ఎస్.కనకదుర్గ, వై.ప్రశాంతి, డేటా ఎంట్రీ ఆపరేటర్లు సిహెచ్.కాత్యాయని, కె.సంతోష్ పాల్గొన్నారు.


వృథాగా పడి ఉన్న పైపులు

ప్రజాశక్తి- లావేరు

మండల కేంద్రం లావేరులో సుభద్రపురం, చీపురుపల్లి రహదారికి అనుకొని ఉన్న ఖాళీ ప్రదేశంలో గత రెండేళ్లుగా జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా ఇంటి ఇంటికి కుళాయి ఏర్పాటుకు గత వైసిపి ప్రభుత్వంలో పెద్దఎత్తున గ్రామాల్లో పైపులైన్ వేసేందుకు పెద్దఎత్తున ప్లాస్టిక్ పైపులు లావేరులో

మూలకు చేరిన పైపులు

ఎకరా ప్రదేశంలో గుట్టలుగుట్టలుగా వేసి ఉంచారు. తర్వాత అక్కడ నుంచి ఒక్క పైపు కూడా కదలలేదు. తరువాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఎక్కడ పనులు అక్కడే నిలిచిపోయాయి. పైపులు ఎండకి ఎండుతూ, వానకు తడుస్తూ తుప్పుపట్టి పాడవుతున్నాయి. మరికొన్ని మాయమవుతున్నాయి. వాటికి దిక్కు ముక్కు లేకుండా ఉండడంతో ఎవరికి నచ్చినవి వారు పట్టుకువెళ్లి పోతున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత శాఖాధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని పలు విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాటిని వినియోగంలోకి తీసుకువచ్చి ప్రజాధనం వృధాకాకుండా చూడాలని కోరుతున్నారు.

అమరవీరుల సేవలు అజరామరం

కవిటి: అమరవీరుల సేవలు అజరామరమని బివికె ప్రిన్సిపాల్ ఎంఅనిల్, కళ్యాణి ఆంగ్ల పాఠశాల ఎఒ రాణి అన్నారు. పుల్వామా దాడిలో అమరులైన వీరులకు శుక్రవారం ఆయా పాఠశాలల్లో ఘనంగా నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారతదేశ పరిరక్షణలో సైనికుల పాత్ర కీలకమని అన్నారు. దేశ రక్షణలో ఎంతోమంది వీరులు అమరులైనారని వారి సేవలు సదా శ్లాఘనీయమని అన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల సిబ్బంది పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : స్థానిక శాంతినికేతన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో పుల్వమా దాడి లో అమరులైన జవాన్లకు



ఇచ్ఛాపురం : చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న కృష్ణమూర్తిరెడ్డి

చైర్మన్ డి.కృష్ణమూర్తిరెడ్డి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో మేనేజర్ కె.సి.పూరి, ఉపాధ్యాయులు సురేఖ, పద్మజ, సునీత, ఇంటరాక్టు క్లబ్ జాయింట్ సెక్రటరీ డి.హర్షవర్ధన్‌రెడ్డి, ఎస్.పి.ఎల్.జ్యోత్స్న పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలంలోని పల్లివూరు పంచాయతీ ప్రజలకు ఉపాధి హామీ పథకం పనులు కల్పించాలని టిడిపి నాయకులు

'ఉపాధి' పనులు కల్పించాలి

కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే గౌతు శిరీషను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థానికులకు ఉపాధి అవకాశాలు లేక వలసలు పోయే పరిస్థితి దాపురించిందని అన్నారు. తీర ప్రాంత గ్రామాల్లో ఉపాధి హామీ పథకం అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు సురాడ మోహనరావు, వంక రామారావు, ఎంపిటిసి మాజీ సభ్యులు మురిపింటి పాపారావు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న రైస్‌మిల్లు కార్మికులు

వేతన సవరణ చేయాలి

ప్రజాశక్తి- మందస

ఛార్టర్ ఆఫ్ డిమాండ్ల మేరకు రైస్ మిల్లు కార్మికులకు వేతన సవరణ వెంటనే చేయాలని సిఐటియు నాయకులు ఎన్.గణపతి, కె.కేశవరావు, ఆర్.దిలీప్‌కుమార్‌లు డిమాండ్ చేశారు. నాలుగు రోజులుగా చేపడుతున్న నిరసనలో భాగంగా శుక్రవారం మందస బజారు కూడలి నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ ఎస్.హైమావతిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థానిక అధికారులు యజమానులపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం వల్లనే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. రైస్ మిల్లు కార్మికులు డిమాండ్ నోటీసు ఇచ్చి ఎనిమిది నెలలు కావస్తున్నా వేతన సవరణ చేసేందుకు ముందుకు రావడం లేదన్నారు. దీంతో కార్మికులు ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైస్‌మిల్లుల యాజమాన్యాల మొండివైఖరే కార్మికులకు సమ్మెలోకి నెట్టిందన్నారు. యాజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ కార్మికులకు హక్కులు ఉల్లంగిస్తున్నారని అన్నారు. జిల్లా లేబర్ అధికారులు చర్యలు తీసుకొని కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారం కాకుంటే దశలవారీగా ఉధృత పోరాటానికి కార్మికులు సమాయత్తమవుతారని అన్నారు. కార్యక్రమంలో రైస్‌మిల్లు వర్కర్స్ యూనియన్ నాయకులు టి.లక్ష్మీనారాయణ, కె.బాలకృష్ణ, బి.దుర్యోధన, పి.కుర్మారావు, ఆర్.ఏకాశి, బి.వెంకటేశం, బి.మల్లేశ్వరరావు, బి.పోలయ్య, ఎ.లోకనాథం, జీడి కార్మిక సంఘం నాయకులు సిహెచ్.చంద్రావతి, గుసిరి బాలమ్మ, బాడ వెంకటమ్మ, బాడ వరాలమ్మ, సిహెచ్.జానకమ్మ, బాడ హిమావతి పాల్గొన్నారు.

వ్యవసాయ కార్యాలయం తెరిచేదెప్పుడు?

సంతబొమ్మాళి: సాక్షాత్తు వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సొంత నియోజకవర్గంలో వ్యవసాయ శాఖకు కార్యాలయం లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందిలు ఎదుర్కొంటున్నారు. గతంలో ప్రజలకు, రైతులకు సౌకర్యం కల్పించడానికి మండలంలో అన్ని శాఖల కార్యాలయాలు ఒకే దగ్గర ఉండాలని ఉద్దేశంతో వ్యవసాయ శాఖ కార్యాలయం నిర్మించారు. ప్రస్తుతం వ్యవసాయశాఖ కార్యాలయం శిథిలవ్యవస్థకు చేరడంతో షట్టర్ వేసి వదిలేశారు. ప్రస్తుతం వ్యవసాయశాఖ కార్యాలయం అవసరాల కోసం వచ్చిన రైతులు వస్తున్నారు. కార్యాలయానికి షట్టర్ వేసి ఉండడంతో వ్యవసాయశాఖ అధికారి ఎక్కడుంటారని మండలానికి వచ్చిన వారిని రైతులు కనుక్కోవాల్సి వస్తోంది. ప్రస్తుతం రబి సీజన్‌లో వేరుశనగ, పెసర, మినుము, వరికి చీడ పీడలు సోకడంతో రైతుల తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. పంటలకు వచ్చిన చీడపీడలకు సలహాలు ఇవ్వాల్సిన వ్యవ సాయ శాఖ అధికారిరి కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి వస్తోంది. మండలానికి


షట్టర్ వేసి ఉన్న వ్యవసాయశాఖ కార్యాలయం

ఉండాల్సిన ఒకే ఒక్క వ్యవ సాయ కార్యాలయం ఎక్కడ ఉందో తెలియని పరిస్థితి. ఇప్పటికైనా పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి వ్యవసాయ కార్యాలయం మండల పరిధిలో ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

క్రైమ్ కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఒడిశా వాసి మృతి

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

జాతీయ రహదారిపై కొయిరాల జంక్షన్ కొయిరాల కూడలి వద్ద జరిగిన ప్రమాదంలో ఒడిశాకు చెందిన వ్యక్తి మృతిచెందాడు. పోలీసుల వివరాల మేరకు ఒడిశా రాష్ట్రం బాలాసూర్ కుర్దా గ్రామానికి చెందిన అభిషేక్ బెహరా, ఆయన భార్య అనయ పాత్రో కలిసి ద్విచక్ర వాహనంపై బీహార్ వెళ్తుండగా కొయిరాల జంక్షన్ వద్ద వాహనం అదుపుతప్పి రోడ్డుపైన బోల్తా పడ్డారు. ఈ ఘటనలో అభిషేక్ బెహరా తీవ్ర గాయాల పాలవ్వగా ఆయన భార్య కాలు విరిగిపోయింది. స్థానికులు స్పందించి వీరిని చికిత్స నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అభిషేక్ బెహరా మృతి చెందాడు. ఈ ఘటనపై పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్


మృతిచెందిన గుర్తు తెలియని వ్యక్తి

టెక్కలి ఆది ఆంధ్రావీధి జాతీయ రహదారిపై ఉన్న ఎర్రన్నాయుడు సమగ్ర రక్షిత మంచినీటి పథకం ప్రాజక్టులో శుక్రవారం సాయంత్రం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని చూసిన స్థానికులు అర్‌డబ్ల్యుఎస్ అధికారులకు, పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు, పోలీసులు మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుని వివరాలు తెలియాల్సి ఉంది.


ఒంటిపై పెట్రోల్ పోసుకుంటున్న సన్యాసమ్మ

బాధితురాలు ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

సంతబొమ్మాళికి చెందిన పందిరి అప్పన్న సన్యాసమ్మ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వివరాల్లోకి వెళ్తే... మేజర్ పంచాయతీ గొల్లవీధికి చెందిన జి.గాయత్రి ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం చేశారని సంతబొమ్మాళికి చెందిన పందిరి అప్పన్న, సన్యాసమ్మ దంపతులు ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం గాయత్రి ఇంటి ఎదుట ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వికలాంగులైన తమ పిల్లలు శ్రావణి, కార్తీక్లకు ఉద్యోగాలు ఇప్పిస్తానని గాయత్రి రూ.18.60 లక్షలు తీసుకుని మోసం చేశారన్నారు. పిల్లలకు ఉద్యోగాలు వస్తాయని ఇల్లు, బంగారం, ఆస్తి అమ్మి డబ్బు ఇచ్చామన్నారు. ఇంతవరకు ఉద్యోగాలు ఇప్పించకపోగా, మేము ఇచ్చిన డబ్బు సైతం ఇవ్వలేదన్నారు. ఎన్నిసార్లు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లినా న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. డబ్బులు ఇచ్చే వరకు ఇవ్వకపోతే ఇక్కడే ప్రాణాలు వదులుతామని, ఇక్కడ నుంచి కదిలేదని పెట్రోల్ ఒంటిపై పోసుకుని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించింది. వెంటనే స్థానికులు అండుకొని పోలీసులు సమాచేరం చేరవేశారు. ఎస్ఐ.రామ సంఘటన స్థలానికి చేరుకుని బాధితురాలు జిల్లా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.


మాట్లాడుతున్న డిఎస్‌పి వెంకట అప్పారావు

గంజాయి పట్టివేత

ఇచ్ఛాపురం: ఒరిస్సా నుంచి అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పట్టణ పోలీసులు అరెస్టు చేసి 18.310 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు కాశీబుగ్గ డిఎస్‌పి వెంకట అప్పారావు తెలిపారు. వీరిని శుక్రవారం విలేకరుల ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమంగా గంజాయి తరలించినా, అమ్మకాలు జరిపినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయి అక్రమరవాణా, అమ్మకాలపై గట్టి నిఘా పెట్టడం జరిగిందన్నారు. అందులో భాగంగా శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో పట్టణంలో గల రైల్వేస్టేషన్ ముందు అనుమానాస్పదంగా ఉన్న ఇద్దరు వ్యక్తులు ముజిమిల్, మహమ్మద్ సిరాజుద్దీన్‌ను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 18.310 కిలోల గంజాయి, రెండు సెల్ ఫోన్లును పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కర్నాటక రాష్ట్రం, బెంగుళూరు నగరానికి చెందిన ముజామిల్, మహమ్మద్ సిరాజుద్దీన్‌లకు గంజాయి తాగే అలవాటు ఉండడం, వారి ఆర్థిక పరిస్థితి బాగులేకపోవడంతో గంజాయి వ్యాపారం చేద్దామని నిర్ణయించు కున్నారన్నారు. అయితే బెంగుళూరులో గంజాయి అమ్ముతున్న విజయ్ కుమార్ అనే వ్యక్తితో వీరికి పరిచయమైంది. అయితే వీరు విజయకుమార్‌కు గంజాయి విక్రయించేందుకు ఒరిస్సా రాష్ట్రంలోని ఖందమాల్ జిల్లా, పుల్బాని ప్రాంతంలో వుంటున్న భరత్ డిఘాల్ వద్ద నుంచి సుమారు 18.310 కేజీల గంజాయిని కొనుగోలు చేసి దానిని బరంపురం నుంచి బస్సులో ఇచ్ఛాపురం వరకు వచ్చి, రైలులో బెంగుళూరు వెళ్లడానికి, రైల్వేస్టేషన్‌కు వెళ్తుండగా టౌన్ పోలీసులకు పట్టుబడినట్లు తెలిపారు. ఈ సమావేశంలో సిఐ మీసాల చిన్నం నాయుడు, టౌన్ ఎస్ఐ ముకుంథరావు తదితరులు పాల్గొన్నారు.

కంచిలి: మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్ సమీపంలో శనివారం సాయంత్రం ఒడిశాకి చెందిన సోమేష్ అనే వ్యక్తి తమిళనాడుకు చెందిన ఇద్దరు వ్యక్తులకు రెండు కిలోల గంజాయి విక్రయిస్తుండగా కంచిలి పోలీసులు వారిని పట్టుకుని, గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పలాస డి.ఎస్.పి వి వెంకట అప్పారావు, సోంపేట సిఐ మంగరాజు విలేకరుల సమావేశంలో నిందితులను ప్రవేశపెట్టారు. తమిళనాడుకు చెందిన అజిత్ అనే లారీ క్లీనర్ ఒడిశాకు చెందిన సోమేష్ వద్ద రెండు కిలోల గంజాయిని కొనుగోలు చేసేందుకు తన స్నేహితుడు కమలుద్దీన్‌తో కలిసి కంచిలి రైల్వే స్టేషన్ వద్దకు వచ్చారు. ఈ ముగ్గురు వ్యక్తులు రైల్వే స్టేషన్ సమీపంలో అనుమానస్పదంగా తిరుగుతుండగా స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఎస్ఐ పారినాయుడు సిబ్బందితో కలిసి వారిని విచారణ చేశారు. ఈ క్రమంలో వారు గంజాయి విక్రయిస్తున్నట్లు తెలుసుకొని వారిని అదుపులోకి తీసుకోవడంతో పాటు 2.08 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు డిఎస్‌పి తెలిపారు.

తప్పని దోమల బెడద

ప్రజాశక్తి- రణస్థలం

అలెగ్జాండర్ ది గ్రేట్.. ప్రపంచ చరిత్రలో అత్యంత విజయవంతమైన, సైనిక కమాండర్లలో ఒకరు. అపజయమే ఎరగని అజేయుడు, మంచి రక్త పుష్టి కలిగిన ప్రపంచ యుద్ధవీరుడైన అలెగ్జాండర్ మలేరియా దోమకాటుకి తన 32వ ఏట యుక్త వయస్సులో మరణించాడని కొందరు చరిత్రకారులు చెబుతున్నారు. ఆ ప్రకారం చూస్తే మనమెంత? ప్రస్తుత వాతావరణంలో నెలకొన్న పరిస్థితులను బట్టి గ్రామాల్లో దోమల బెడద ఎక్కువగా ఉంది. సామాన్యులు సాయంత్రం అయ్యేసరికి నిద్ర పోవాలంటే గ్రామాల్లో అల్లాడి పోతున్నారు. హాయిగా పడుకోవాలంటే దోమలకు ప్రత్యేకంగా నివారణ చర్యలు చేపడితేనే గాని కంటిమీద కునుకు ఉండటం లేదని సామాన్యులు వాపోతున్నారు. జనవరి నుంచి వరుసగా పండగలు, జాతరలు, గ్రామ పండుగలు రావడం వలన చుట్టాలు, బంధువులను ఆహ్వానించారు. ఐతే చీకటి


ఫాగింగ్ మిషన్‌తో దోమల నివారణ చర్యలు (ఫైల్)

పడకముందే దోమలతో యుద్ధం చేయాల్సి వస్తుందని, చుట్టాల దగ్గర చిన్నబోతున్నట్లు కుటుంబీకులు వాపోతున్నారు. ఏ ఊరెళ్ళినా ఇదే పరిస్థితి. ఎక్కడా మారడం లేదు. ప్రతి ఉదయం దేవుడికి దీపం, సాయంత్రం దోమల చక్రం తప్పనిసరి అయిపోయింది. ఒకవైపు దోమల చక్రాలతో ఊపిరితిత్తులు పాడవుతాయని డాక్టర్లు చెబుతుంటే.. ఈ పూటకి దోమల నుంచి బయటపడితే చాలనుకొని ప్రజలు ఎలక్ట్రికల్ బ్యాట్లు పట్టుకొని దోమలపై యుద్ధాలు చేస్తున్నారు. ఇంతకు ముందులా కాకుండా ఆధునిక ఫాగింగ్ మిషన్లు అందుబాటులోకి వచ్చాయి కాబట్టి గ్రామాల్లో ఉన్న పెద్దలు, నాయకులు, అధికారులు స్పందించి ఆయా గ్రామాల్లో దోమల బెడదను, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని పంచాయతీ సిబ్బందితో ఫాగింగ్ చేయాలని పలువురు కోరుతున్నారు. ఈ ఫాగింగ్ మిషన్లు పాతతరం వలె కాకుండా కొత్త టెక్నాలజీతో ఒకమనిషి అత్యంత సునాయసంగా ఫాగింగ్ చేయుటకు, ఇరుకు సందుల్లో కూడా ఫాగింగ్ చేసేందుకు అనువుగా ఉంటాయని చెబుతున్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని దోమల నివారణకు, ప్రజలను దోమల నుంచి ఉపసమనం పొందే చర్యలు చేపట్టాల్సిందిగా, దోమల వలన ప్రబలే వ్యాధులు, రోగాల నుంచి చంటి పిల్లలను, వృద్ధులను కాపాడే దిశగా తగు జాగ్రత్తలు తీసుకోవాలని నాయకులను, అధికారులను పలు గ్రామాలకు చెందిన గ్రామస్తులు కోరుతున్నారు.


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

క్రీడా మైదానం ఏర్పాటుకు వినతి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

క్రీడాకారులను ప్రోత్సహించడానికి క్రీడా మైదానాలు ఏర్పాటు చేయాలని జనసేన నాయకులు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే గౌతు శిరీషను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. మండలంలోని కొమరల్తాడ, తామాడపేట గ్రామాల యువత పాఠశాల విద్యార్థులకు క్రీడా మైదానాలు అవసరాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. పాఠశాలల్లో సుమారు 60 మంది విద్యార్థులు, రెండు గ్రామాలకు చెందిన యువకులు ఆడుకోవడానికి క్రీడా మైదానం ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో జనసేన ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్ పండా, కొమరల్తాడ జనసేన అధ్యక్షులు చింత మోహనరావు, తామాడ లక్ష్మణరావు, గొండి రవి, మాగుబరి లచ్చయ్య, బొడ్డు బాబూరావు, బమ్మిడి నవీన్, చింత పవన్‌కుమార్, దండుపాటి పవన్‌కుమార్ పాల్గొన్నారు.



దుర్గాదేవి ఉత్సవాలు ప్రారంభం

పోలాకి: మండలంలోని సుసరాం కొండపై ఉన్న దుర్గా దేవత అమ్మవారి 47వ వార్షికోత్సవం వేడుకలు ధర్మకర్త సనపల అప్పలసూరి ఆధ్వర్యాన శుక్రవారం ప్రారంభించారు. ఈ ఉత్సవాలు మూడు రోజుల పాటు సాగుతాయని తెలిపారు. యాత్రికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ దుంపల ఆనందరావు, మాజీ ఎంపిపి తమ్మినేని భూషనరావు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దుంపల భాస్కరరావు పాల్గొన్నారు.

దేశ విముక్తికి ఐక్యత అవసరం

న్యూడెమాక్రసీ జిల్లా కార్యదర్శి ప్రకాష్

ప్రజాశక్తి- పలాస

దేశ విముక్తికి విప్లవకారుల ఐక్యత అవసరమని న్యూ డెమొక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్ అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని రెండు సిపిఐఎంఎల్ న్యూడెమొక్రసీ పార్టీల విలీన ప్రకటన సభ విజయవాడ రాఘవయ్య పార్క్ ఎంబి భవన్ ఆడిటోరియంలో ఈ నెల 23న ఉదయం 10 గంటలకు సభ నిర్వహిస్తామని అన్నారు. ఈ సభను విజయవంతం చేయడానికి విప్లవకారులు, అభిమానులు, ప్రజా సంఘాలు, మేధావులు, ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు మండలంలోని బొడ్డపాడు అమర వీరుల స్మారక భవనం వద్ద ఉభయ పార్టీ శ్రేణులు


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

శుక్రవారం పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ రాష్ట్ర కమిటీ సభ్యుడు వంకల మాధవరావు, గొరకల బాలకృష్ణ, జి.వీరాస్వామి, పోతనపల్లి కుసుమ, బతకల ఈశ్వరమ్మ, కుత్తుం హేమక్క, బర్ల జానకమ్మ, సార జగన్, బర్ల గోపి, వంకల పాపయ్య, సార నూకయ్య, పి.మల్లిబాబు, కర్రి అప్పారావు పాల్గొన్నారు.


ఆర్థికసాయం అందిస్తున్న సభ్యులు

కిడ్నీ బాధితునికి ఆర్థికసాయం

ప్రజాశక్తి- కవిటి

కిడ్నీ వ్యాధితో బాధపడుతూ వారానికి మూడు సార్లు డయాలసిస్ చేయించుకుంటున్న బాధితునికి ఆర్థికసాయం అందించి అండగా నిలిచింది కేశుపురానికి చెందిన కాశీమాత సేవా సమితి. కవిటి మండలం బల్లిపుట్టుగకు చెందిన బచ్చల తేజ కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతూ వారానికి మూడుసార్లు డయాలసిస్ చేయించుకుంటున్నారు. ఐదుగురు ఆడ బిడ్డలతో రెక్కాడితే గానీ డొక్కాడని అతని కుటుంబం తేజ వైద్యం కోసం దాతల సాయం కోసం ఎదురుచూస్తోంది. విషయం తెలుసుకున్న కాశీమాత సేవా సమితి సభ్యులు శుక్రవారం గ్రామానికి చేరుకుని తక్షణ సాయంగా రూ.15వేలు అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ దాతలు తేజ పరిస్థితిని అర్థం చేసుకుని మానవతా దృక్పథంతో సాయం అందించాలని కోరారు.


దర్శించుకుంటున్న జడ్జి హరిప్రియ

'కొత్తమ్మతల్లి' సందర్శన

కోటబొమ్మాళి: స్థానిక కొత్తమ్మతల్లిని నరసన్నపేట జూనియర్ కోర్టుకు చెందిన జూనియర్ సివిల్ జడ్జి హరిప్రియ శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి కమ్మకట్టు రాజేష్ న్యాయమూర్తికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆకస్మిక తనిఖీ

పాతపట్నం: పలాస డివిజన్ తూనికలు కొలతల విభాగం ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ పలు దుకాణాలను శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. 218 మంది వర్తకులకు సంబంధించిన రెన్యువల్స్ తనిఖీ చేసి వారి కాటాలకు సీల్స్ వేయించామని తెలిపారు. తూనికలు కొలతలు విభాగానికి సంబంధించిన షీలు వేయని నలుగురు వర్తకులపై కేసు నమోదు చేసి అపరాధ రుసుం విధిస్తామన్నారు. వర్తకులందరూ సకాలంలో తమ కాటాలకు షీలు వేయించుకోవాలన్నారు.

చురుగ్గా రక్షణ గోడ నిర్మాణ పనులు

లావేరు: మండల కేంద్రం లావేరు జెడ్‌పి పాఠశాల రక్షణగోడ నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఇప్పటికే డొంకల తీసి చదును చేసే పనులు చేపట్టారు. సోమవారం జెసిబితో పిల్లర్ గోతులు తీసే పనులు ప్రారంభించారు. మెటీరియల్ చేర్చి పనులు ప్రారంభం చేశారు. రక్షణగోడ నిర్మాణం పనులు పూర్తయితే మందుబాబులకు అసాంఘిక కార్యక్రమాలకు అడ్డుకట్ట పడుతుందని పలువురు అంటున్నారు.


చురుగ్గా సాగుతున్న రక్షణ గోడ నిర్మాణ పనులు

ఇన్‌ఛార్జి అధికారులతో ఇక్కట్లు


తహశీల్దార్ కార్యాలయం

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

మండలంలో తహశీల్దారు కార్యాలయంలో వివిధ కీలక అధికారులు లేకపోవడంతో ఇన్‌ఛార్జిలతో నెట్టుకొస్తున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందించడంతో పాటు వివిధ పత్రాలు కావాలంటే రెవెన్యూ శాఖ చాలా కీలకమైనది. గ్రామాల్లో ఏం చేయాలన్నా ఈ శాఖ అధికారులు ఉండాల్సిందే. అటువంటి మండలంలో రెగ్యులర్ తహశీల్దార్, డిటి, ఆర్ఐ, కంప్యూటర్ ఆపరేటర్ లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరో పక్క ఇన్‌ఛార్జిలే దిక్కు కావడంతో సరైన సమయానికి పనులు కావడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కీలకమైన అధికారులు లేకపోవడంతో కిందిస్థాయి అధికారులు ఆడిందే ఆటపాడిందే పాటగా విధులు నిర్వహిస్తున్నారని బహిరంగ విమర్శలు ఉండనే ఉన్నాయి. ఇన్‌ఛార్జిలుగా ఉన్న అధికారులు అప్పుడప్పుడు చుట్టం చూపుగా వచ్చి పోతున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో రెవెన్యూ శాఖకు సంబంధించిన సర్వేలు, ధ్రువీకరణ పత్రాలు జారీలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రస్తుత కంప్యూటర్ ఆపరేటర్‌గా ఉంటున్న సిబ్బంది కీలకమని, అతను లేకపోతే కొన్ని పనులు జరగవని కొంతమంది రెవెన్యూ అధికారులు వాయిదా వేస్తున్నట్లు తెలుస్తోంది. కూటమి ప్రభుత్వం కీలక స్థాయి అధికారులను నియమిస్తే తమకు మెరుగైన సేవలు అందుతాయని ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రజా ప్రతినిధులు పట్టించుకోని తక్షణమే అధికారులను నియమించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

డిజిటల్ అసిస్టెంట్ల సంఘం

మండల అధ్యక్షునిగా లోకేష్

ఇచ్ఛాపురం : మండలంలోని పంచాయతీ సెక్రెటరీ గ్రేడ్-6 డిజిటల్ అసిస్టెంట్ మండలస్థాయి నూతన కార్యవర్గం ఏర్పాటు చేశారు. నూతన అధ్యక్షునిగా దుర్గాసి లోకేష్, ప్రధాన కార్యదర్శిగా సాడి కృష్ణారావు, ట్రెజరర్‌గా కురమాన నీరజ, దున్న తారకేశ్వరరావు, చుక్క దీపిక, ఆర్గనైజేషన్ కార్యదర్శిగా ఏకగ్రీవం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మండలంలోని డిజిటల్ అసిస్టెంట్ సమస్యలను పరిష్కారానికి, వారి సంక్షేమానికి కృషి చేయడమే తమ ప్రధాన లక్ష్యమన్నారు. డిజిటల్ అసిస్టెంట్ ఎదుర్కొనే ప్రతి సమస్యనూ యూనియన్ కట్టుబడి ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కె.రామారావు, ఇఒపిఆర్‌డి కృష్ణ, సీనియర్ అసిస్టెంట్ పాణిగ్రాహి, జూనియర్ అసిస్టెంట్ వినోద్, కంప్యూటర్ ఆపరేటర్ మౌళి, జగదీష్ పాల్గొన్నారు.


పత్రాన్ని అందజేస్తున్న కార్యవర్గ సభ్యులు

పేదల 'ఉపాధి'కి నిధుల కోత

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మండలంలో 38 గ్రామ పంచాయతీల్లో పేద కూలీలకు ఉపయోగపడే ఉపాధి హామీ పనులకు భారీగా నిధుల కోతపడింది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు పనులు కల్పన బాగా తగ్గిపోయింది. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లోని జూన్-జనవరి మధ్య కల్పించిన పని దినాలకు, ఈ ఆర్థిక సంవత్సరం (2024-25)లోని జూన్-జనవరి మధ్య కల్పించిన పని దినాలను పోలిస్తే కూలీలకు పని దినాలు తగ్గాయి, దీనివల్ల గ్రామీణ పేదలు నష్టపోతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఉపాధి హామీ అమలులో రాజకీయ జోక్యం పెరిగిపోవడం వల్లే పేదలకు పనులు కల్పన తగ్గిపోయినట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆయా పంచాయతీలకు చెందిన టిడిపి నాయకులు, కార్యకర్తలు సంబంధిత అధికారిపై ఒత్తిడి తీసుకొచ్చారు. ఉపాధి హామీలో కీలకమైన ఫీల్డ్ అసిస్టెంట్లను పెద్దఎత్తున మండలంలో 23 మందిని ఒకేసారి తొలగించారు. అనంతరం టిడిపి నాయకుల కార్యకర్తలను, బంధువులను నియమించుకున్నారు. కొత్తగా


కోటబొమ్మాళిలో పనులు చేస్తున్న కూలీలు

వచ్చిన వారికి ఉపాధి హామీపై ఎలాంటి అవగాహన, అనుభవం లేకపోవడంతో వీరు కూలీలతో ప్రభుత్వ నిబంధనలు ప్రకారం పనులు నిర్వహించలేరు. ఒకవేళ పనులు నిర్వహిస్తే అటు ఇటుఐ యితే నష్టపోయేది అధికారులేనని భయంతో సంబంధిత అధికారులు గ్రామాల్లో పనులు వేయడం లేదని పలువురు అంటున్నారు. ఏదేమైన గ్రామాల్లో వ్యవసాయ పనులు లేక, ఉపాధి పనులు అధికారులు కల్పించకపోవడంతో కూలీలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి కూలీలకు న్యాయం చేయాలని కోరుతున్నారు.